క్లుప్తంగా

శివాజీ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న కమిటీ సభ్యులు

బెజ్జూర్: మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఏర్పాటుకు సోమవారం కమిటీ సభ్యులు భూమిపూజ చేశారు. ఆరె సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు బుజాడి సత్తయ్య, రంగనాయక ఆలయ కమిటీ అధ్యక్షుడు తంగడపల్లి మహేష్, పాపన్నపేట ఎంపీటీసీ శ్రీనివాస్, పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ దందెర ఇస్తారి, మాజీ సర్పంచ్ బుజ్జాడి శేఖర్, ఆరే సంక్షేమ సంఘం నాయకులు, బీజేపీ మండల అధ్యక్షుడు బాలకృష్ణ, నాయకులు పద్మాకర్, వెంకటేష్, బీఆర్ఎస్ నాయకుడు జావిద్ పాల్గొన్నారు.

సీసీ రోడ్ల పనులు ప్రారంభం



కిష్టాపూర్‌లో ప్రారంభిస్తున్న శ్యాంనాయక్

రెబ్బెన: నియోజకవర్గంలో అంతర్గత రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం సీసీ రోడ్లు మంజూరు చేస్తోందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీర శ్యాంనాయక్ అన్నారు. మండలంలోని నంబాల, కిష్టాపూర్ గ్రామాల్లో ఈజీఎస్ నిధులతో చేపడుతున్న సీసీ రోడ్ల పనులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్ణీత సమయంలోగా మండలానికి మంజూరైన సీసీ రోడ్ల పనులు పూర్తి చేయాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు లావుడ్య రమేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవాజీ, నాయకులు సుదర్శన్‌గౌడ్, చిరంజీవిగౌడ్, ఆనంద్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి: మండలంలోని సాంగ్వి గ్రామంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా మంజూరైన సీసీ రోడ్డు పనులను సోమవారం ఆసిఫాబాద్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మునీర్ అహ్మద్ ప్రారంభించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆత్రం కుసుంబ్‌రావు, నాయకులు ఆత్రం లింబారావు, బాపూరావు, బాబు, తిరుపతి, రాజు, రమేశ్, శంకర్ తదితరులు ఉన్నారు.

బాలల హక్కుల కార్యశాలకు అధికారులు



పాల్గొన్న ఎస్‌వో శ్రీనివాస్, ఎంఈవో

ఆసిఫాబాద్‌రూరల్: బాలల హక్కుల పరిరక్షణ కోసం జాతీయ మిషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో సోమవారం నిర్వహించిన కార్యశాలకు జిల్లా విద్యాశాఖ ఎస్‌వో శ్రీనివాస్, ఎంఈవో వెంకటేశ్వర్, భిక్షపతి పాల్గొన్నారు. బాలల హక్కులు, సంరక్షణ పిల్లలుగా ఉండడానికి కారణాలు, పరిష్కార మార్గాలు తదితర అంశాలపై జాతీయ రాష్ట్రస్థాయి ఎన్‌సీపీసీఆర్, లేబర్ కమిషన్ కార్యశాల నిర్వహించారు.

సన్మానం



సాగర్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

దహెగాం: మండలంలోని గిరవెల్లి గ్రామానికి చెందిన రైతు సాగర్ ఇటీవల పోలీసు ఉద్యోగం సాధించాడు. పోలీస్ శిక్షణకు వెళ్తున్న ఆయనకు సోమవారం గ్రామస్తులు సన్మానించారు. గ్రామస్తులు మధుకర్, వెంకన్న, దిలీప్, అంజన్న శంకర్ తదితరులు పాల్గొన్నారు.

'దశల వారీగా ఆరు గ్యారంటీలు అమలు'

ఆదిలాబాద్‌రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను దశల వారీగా అమలు చేస్తుందని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని భీంసరి గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద రూ. 5 లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో జైనథ్ జెడ్పీటీసీ తుమ్మల అరుంధతి వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మంచికట్ల ఆశమ్మ, బిక్కి గంగాధర్, గిమ్మ సంతోష్, బాయిన్‌వార్ గంగారెడ్డి, భరత్ వాగ్మరే, కోరేటి కిషన్, వసంత్, అంబదాస్, హన్మాండ్లు, దయాకర్ పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

- నివాళులర్పించిన నాయకులు

రెబ్బెన: ఛత్రపతి శివాజీ జయంతిని జిల్లా వ్యాప్తంగా సోమవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ఆరె సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేశారు. పాత పోలీస్‌స్టేషన్ సమీపంలో జెండాను ఎగురవేశారు. జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, రెబ్బెన ఎస్సై చంద్రశేఖర్, ఆరె సంఘం, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ఛత్రపతి శివాజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. లక్ష్మీపూర్‌లో శివాజీ విగ్రహం వద్ద గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేసి విగ్రహానికి పూలమాలలు వేశారు. ఆరె సంఘం మండల అధ్యక్షుడు చౌదరి సుభాష్, ప్రధాన కార్యదర్శి కోలే శ్యాంరావు, నాయకులు లావుడ్య రమేశ్, చిరంజీవిగౌడ్, పూదరి హరీశ్, సుదర్శన్‌గౌడ్, దుర్గం దేవాజీ తదితరులు పాల్గొన్నారు.

చింతలమానేపల్లి: మండల వ్యాప్తంగా ఆరె కుల సంఘం ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కాషాయ జెండా ఆవిష్కరించారు. మహిళలు ప్రత్యేకంగా మంగళ హారతులను తీసుకొచ్చి శివాజీ విగ్రహానికి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ఎంపీపీ నానయ్య, జెడ్పీటీసీ శ్రీదేవి పాల్గొన్నారు.

దహెగాం: గ్రామాల్లో ఛత్రపతి శివాజీ జయంతిని నిర్వహించారు. మండల కేంద్రంలో ఆరె సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వీధుల గుండా నిర్వహించిన శోభాయాత్రలో మహిళలు పాల్గొన్నారు. అనంతరం శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విగ్రహం వద్ద జెండాను ఎగురవేశారు. ఆరె సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు నారాయణ పాల్గొన్నారు.

కెరమెరి: స్థానిక శివాలయం ఆవరణలో ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాత్రి శోభాయాత్ర నిర్వహించారు. యువకులు జెండాలతో డీజే పాటలపై నృత్యాలు చేశారు. ఎంపీపీ మోతిరాం, జెడ్పీటీసీ దుర్పత బాయి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బెజ్జూర్: ప్రతి ఒక్కరూ ఛత్రపతి శివాజీ చూపిన బాటలో నడవాలని ఎస్సై విక్రం అన్నారు. మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో ఆయన జయంతిని నిర్వహించారు. ఉత్సవ కమిటీ నాయకులు ఛత్రపతి శివాజీ మహారాజ్ జెండాను ఆవిష్కరించారు. ఎంపీటీసీ పర్వీన్ సుల్తార జావిద్ అలీ, ఆరె సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు సత్తయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు బాలకృష్ణ, నాయకులు భాస్కరాజ్, పద్మాకర్, జావిద్, జనార్దన్, బాపు, ఆశన్న, గణపతి, శేఖర్, ఇస్తారి, శివాజీ మహారాజ్ జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



దహెగాం: శివాజీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఆరె సంక్షేమ సంఘం నాయకులు

కౌటాల: ఛత్రపతి శివాజీ ఆదర్శప్రాయుడని ఆరె సంఘం మండల అధ్యక్షుడు ధునుర్కార్ వసంత్ రావ్ అన్నారు. మండల కేంద్రంలోని ఆరె సంఘం భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం జెండాను ఎగురవేశారు. ఆయా గ్రామాల్లో జరిగిన వేడుకల్లో ఆరె కులస్తులు పాల్గొని ర్యాలీ తీశారు. గుండాయిపేట్‌లో మరాఠీ గోందాడి కార్యక్రమాన్ని నిర్వహించారు. డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమురం మాంతయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు వానుపటేల్ పాల్గొన్నారు.

సిర్పూర్(టి): మండలంలో ఆరెకుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతిని నిర్వహించారు. బస్టాండ్ ప్రాంతంలో మండల అధ్యక్షుడు శంకర్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం జెండాను ఆవిష్కరించారు. గౌరవ అధ్యక్షుడు శంకర్, నాయకులు మోహన్, కిర్మరె శ్యామ్‌రావ్, మారుతి, కిశోర్, రమేశ్, నందాజీ, యువరాజ్ పాల్గొన్నారు.

లింగాపూర్: మండలకేంద్రంతోపాటు వంజారిగుడా, దంపూర్, పిక్లాతండా, కొత్తపల్లి, వంకామద్ది గ్రామాల్లో ఛత్రపతి శివాజీ జయంతిని నిర్వహించారు. శివాజీనాగర్‌గొజే, పాండురంగ్, నాథురావ్, నారాయణ్, ఉమాంకాంత్ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని ఛత్రపతి శివాజీ చౌరస్తా (లారీ చౌరస్తా) వద్ద బీజేపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ శివాజీ గొప్ప ధైర్యశాలి అని కొనియాడారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొంగ సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు సిందం శ్రీనివాస్, జిల్లా కోశాధికారి అరుణ్‌లోయా, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోలెం వెంకటేశ్, నియోజకవర్గ కన్వీనర్ వీరభద్రచారి, చిలువేరు ప్రవీన్, ఆర్మీ మాజీ జవాన్ శివ, భజరంగ్‌దళ్ జిల్లా కన్వీనర్ శివాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని మోతుగూడ, బూర్గుడ, అప్పపల్లి, రాజుర, బెల్గాం, గుండితోపాటు అన్ని గ్రామాల్లో ఆరె కులస్తులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి అన్నదానం నిర్వహించారు. గ్రామ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వినోద్, గోపాల్, రాజయ్య, రవీందర్, ప్రభాకర్, శ్రీనివాస్, మహిళలు పాల్గొన్నారు.

జైనూర్: పోరాట యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ అని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కనక యాదవరావు అన్నారు. మండల కేంద్రంలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. వంజరి సంఘం జాతీయ నాయకుడు గోపీనాథ్ గిత్తే, బీఆర్ఎస్ నాయకుడు మెస్రం అంబాజీ, కాంగ్రెస్ జిల్లా ఎస్టీ చైర్మన్ కుడ్మేత విశవనాథ్, నాయకులు శివరాజ్ షిందే ఉన్నారు.



లింగాపూర్: పూజలు చేస్తున్న గ్రామస్తులు



చింతలమానేపల్లి: వేడుకల్లో పాల్గొన్న మహిళలు



కౌటాలలో..



కెరమెరి: శోభాయాత్రలో యువకులు



బెజ్జూర్: వేడుకల్లో పాల్గొన్న నాయకులు



రెబ్బెనలో పాల్గొన్న ఆరె సంఘం నాయకులు



సిర్పూర్(టి): జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



దహెగాం: శోభాయాత్రలో భక్తులు



కెరమెరిలో..

రైస్ మిల్లు మూసివేయాలి



ఆర్ఐకి వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

కౌటాల: మండలంలోని ముత్తంపేట్ గ్రామంలో గల సాయికృష్ణ రైస్‌మిల్లు మూసివేయాలని కోరుతూ గ్రామస్తులు సోమవారం ఆర్ఐ దిలీప్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ నడి మధ్య ఉన్న రైస్‌మిల్లు నుంచి వెలువడే దుమ్ముతో అనారోగ్య సమస్యలు వస్తున్నాయని తెలిపారు. అధికారులు మిల్లును మూసివేయాలని లేకపోతే కలెక్టర్, ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్తామన్నారు. గ్రామస్తులు దూలం రవి, శంకర్, భీమయ్య, రాజులు, గణేశ్, భీంరావు, రమేశ్, సుమలత, సత్తక్క, అమ్మక్క, వనిత, సువర్ణ పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో ప్రతిభ

కాగజ్‌నగర్‌రూరల్: బెల్లంపల్లిలో జరిగిన కరాటే పోటీల్లో కాగజ్‌నగర్ ఫాతిమా కాన్వెంట్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. అశ్విత, సిద్విలాస్‌లు గోల్డ్‌మెడల్ సాధించగా, శైలి సర్కార్, బిందుష బ్రౌన్ బెల్ట్‌లో గ్రాండ్ చాంపియన్‌షిప్ సాధించినట్లు కరాటే మాస్టర్ దేవయ్య తెలిపారు. బాలుర విభాగంలో అశ్విత్, త్రినాథ్, వివేక్, తేజ్, అశ్విత్, వినోద్, వినయ్‌లు ప్రతిభ కనబర్చినట్లు పేర్కొన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ప్రిన్సిపాల్ సాఫల్య, తదితరులు అభినందించారు.

అంతర్గత మార్కుల పరిశీలన

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల (పెట్రోల్‌పంపు)లో సోమవారం పదో తరగతి విద్యార్థుల అంతర్గత మార్కులను ప్రత్యేక బృందం పరిశీలించింది. బృందం సభ్యులు నాలుగు ఫార్మేటివ్ అసెస్‌మెంట్ల మార్కులను పరిశీలించారు. సభ్యులు శ్రీలత, నాగేశ్వర్‌రావు, సుధాకర్, తిరుపతయ్య, అనీష్, శ్యాంసుందర్, రోజా, ముకుందం, హెచ్‌ఎంలు వెంకటరాజం, మంగ ఉన్నారు.

నేడు రక్తదాన శిబిరం

కౌటాల: మండల కేంద్రంలోని మన్నెవార్ సేవా సంఘం భవనంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పండరీ, దిలీప్, మారుతి సోమవారం తెలిపారు. ఉదయం 10 నుంచి 4 గంటల వరకు జరిగే శిబిరంలో ప్రజలు రక్తదానం చేయాలని కోరారు.

అలంకారప్రాయంగా..



చిన్నఅరటిపెల్లి గ్రామంలో ఫెన్సింగ్ లేని పల్లె ప్రకృతివనం

- తిర్యాణి మండలంలో ప్రకృతి వనాల పరిస్థితి
- కొన్నిచోట్ల వనాలకు గేట్లు లేవు
- మరికొన్ని చోట్ల ఏర్పాటు చేయని ఫెన్సింగ్

తిర్యాణి: మండలంలోని గ్రామాల్లో ఆహ్లాదం పంచాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం పల్లె ప్రకృతివనాలు ఏర్పాటు చేసింది. 29 గ్రామ పంచాయతీ పరిధిలోని 143 గ్రామాల్లో వనాలు ఏర్పాటు చేసి మొక్కలు పెంచారు. కానీ క్షేత్రస్థాయిలో వాటి నిర్వహణపై శ్రద్ధ చూపకపోవడంతో కొన్ని వనాలు అలంకారప్రాయంగా మారాయి. ఉల్లిపిట్ట గ్రామంలోని అటవీ ప్రాంతంలోని బృహత్‌వనంలో 31 వేల మొక్కలు నాటాలనే లక్ష్యాన్ని పెట్టుకోగా, నేటికి కేవలం 4 వేల మొక్కలు నాటారు. ఇందులో సగానికి పైగా అవి చనిపోయాయి. ఈ వనం మండల కేంద్రానికి 20 కి.మీ దూరంలో ఉండటంతో అలంకారప్రాయంగా మారింది. వీటితోపాటు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వనాల్లో ఇదే పరిస్థితి. ఎదులపహాడ్ పంచాయతీ పరిధి చిన్నఅరటిపెల్లి పల్లె ప్రకృతి వనానికి ఫెన్సింగ్ ఏర్పాటు చేయకపోవడంతో పశువులకు అడ్డాగా మారింది. వీటితోపాటు మండల కేంద్రంలో ప్రకృతి వనానికి ఇప్పటికి గేటు ఏర్పాటు చేయలేదు. ఇవే కావు సగానికి పైగా వనాల్లో ఇలాంటి పరిస్థితి ఉంది. ఇప్పటికి కొన్నివనాలు గ్రామాలకు దూరంగా ఉండటం, అందులో మొక్కలు లేకపోవడం..వాటి నిర్వహణను అధికారులు పట్టించుకోకపోవడంతో ఎందుకు పనికిరాకుండా ఉన్నాయి.

చర్యలు తీసుకోవాలి

పల్లె ప్రకృతివనాల పేరిట అధికారులు, ప్రజాప్రతినిధులు నిధులు దుర్వినియోగం చేశారు. ఏ గ్రామంలో నిబంధనల ప్రకారం పల్లె ప్రకృతివనాలు లేవు. వనాల్లో జరిగిన అవినీతిపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు చేపట్టాలి.– **రమేశ్‌గౌడ్, గడలపెల్లి, ఎంపీటీసీ**

ఘనంగా హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన



హోమం నిర్వహిస్తున్న పండితులు



కలశాలతో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

వాంకిడి: మండల కేంద్రంలోని ఇంద్రానగర్ కాలనీలో శ్రీ అభయాంజనేయ స్వామి, శివ పంచాయతన విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. శివకేశవ ఆలయ సమీపంలోని చిక్లీ నది నుంచి కలశాలతో జలాన్ని సేకరించి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం 108 కలశాలు, విగ్రహాలతో బాజభజంత్రీల మధ్య శోభాయాత్ర చేపట్టారు. శివకేశవ ఆలయం నుంచి ప్రారంభమైన శోభాయాత్ర నూతనంగా నిర్మించిన ఆంజనేయ ఆలయం వరకు సాగింది. పూజలతో యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ఠ, నవగ్రహ హోమం నిర్వహించారు. ఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం మరో రెండు రోజుల పాటు జరుగనుంది. పండితులు పెండ్యాల గౌతమ్‌శర్మ, గట్టు సీతారాం శర్మ, శంకర్‌శర్మ, మాజీ సర్పంచ్ తుకారాం, ఎస్సై సాగర్ పాల్గొన్నారు.

ప్రారంభమెప్పుడో?

- వైకుంఠధామాలు, డంప్‌యార్డు, సెగ్రిగేషన్ షెడ్లు
- ఏళ్లు గడుస్తున్నా నిరుపయోగం

ఆసిఫాబాద్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ పంచాయతీకి వైకుంఠధామం, డంప్‌యార్డు, సెగ్రిగేషన్ షెడ్లు నిర్మించింది. వీటిని నిర్మాణం పూర్తిచేసి ఏళ్లు గడిచి సర్పంచుల పదవీకాలం ముగిసినా నేటికి ప్రారంభించలేదు. జిల్లావ్యాప్తంగా 335 గ్రామ పంచాయతీల్లో నిరుపయోగంగానే దర్శనమిస్తున్నాయి. కొన్నిచోట్ల వాగు పక్కనే నిర్మించడంతో వాగు ఉధృతికి కొట్టుకుపోయాయి. నాసిరకంగా నిర్మించడంతో గోడలకు బీటలు బారుతున్నాయి. కొత్తగా వచ్చిన ప్రభుత్వం వాటిని పట్టించుకుంటుదా లేదా? అని వేచి చూడాలి. జిల్లాలో ప్రభుత్వం ప్రతీ పంచాయతీలకు కోట్ల రూపాయలతో నిర్మించిన వైకుంఠధామాలు, డంప్‌యార్డ్, సెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగానే దర్శనం ఇస్తున్నాయి. సెగ్రిగేషన్ షెడ్లు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి.

జిల్లాలో 335 పంచాయతీలు

జిల్లావ్యాప్తంగా 335 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ప్రతి గ్రామ పంచాయతీకి వైకుంఠధామాల నిర్మాణాలకు 2019లో ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వీటిలో ఆసిఫాబాద్ మండలంలో 27 జీపీల్లో గాను పీఆర్ శాఖ 22 పంచాయతీల్లో, ఈజీఎస్ ద్వారా 4, రూర్బన్ నిధుల నుంచి జిల్లా కేంద్రం ఒకటి నిర్మాణం చేపట్టారు. పీఆర్ శాఖ నుంచి నిర్మించిన వాటికి రూ.12.60 లక్షలు, ఈజీఎస్ ద్వారా నిర్మించిన వాటికి రూ.10 లక్షలు నిధులు మంజూరు చేశారు. జిల్లాలో సుమారు రూ.8.29 కోట్లతో 335 పంచాయతీల్లో సెగ్రిగేషన్ షెడ్లు నిర్మించి నిరుపయోగంగా వదిలేశారు. వాటికి నీటి కరెంట్ సౌకర్యం లేక నిరుపయోగంగానే ఉంటున్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

కాంగ్రెస్ పట్టించుకునేనా..

కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించి నిరుపయోగంగా ఉన్న వైకుంఠధామాలు, సెగ్రిగేషన్ షెడ్లు పదవీ ముగిసిన ప్రారంభించలేకపోయారు. కోట్ల రూపాయలతో నిర్మించి ప్రధానంగా కరెంట్, నీటి సౌకర్యం కల్పిస్తే ఉపయోగంలో వస్తాయి. కాని ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో నిరుపయోగంగానే మారనున్నాయి. కొన్నిచోట్ల నాసిరకం పనులు చేపట్టడంతో గోడలకు పగుళ్లు ఏర్పడ్డాయి. మరికొన్ని చోట్ల గాలికి రేకులు లేచిపోయే పరిస్థితి.



ఈదులవాడలో నిరుపయోగంగా వైకుంఠధామం

ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా చర్యలు

రెబ్బెన: గంగాపూర్ జాతరకు తరలివచ్చే భక్తులకు ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు రెబ్బెన సీఐ చిట్టిబాబు అన్నారు. గంగాపూర్ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో కొనసాగుతున్న జాతర ఏర్పాట్లను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రెబ్బెన నుంచి గంగాపూర్ వెళ్లే రహదారి పక్క మొరం పోసి చేస్తున్న చదును పనులతో పాటు ఆలయ పరిసరాల్లో చేపట్టిన పనులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతర ఏర్పాట్ల పనుల్లో వేగం పెంచాలని సూచించారు. మూడు రోజుల పాటు కొనసాగే జాతరకు జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. రెబ్బెన ఎస్సై చంద్రశేఖర్ ఉన్నారు.



పనులు పరిశీలిస్తున్న సీఐ చిట్టిబాబు, ఎస్సై చంద్రశేఖర్

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆర్‌బీఎస్‌కే మెడికల్ ఆఫీసర్ కశ్యప్ అన్నారు. రాష్ట్రీయ బాల్ స్వస్థ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సోమవారం వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కోవ విఠల్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి నారాయణరెడ్డి, ఫజల్, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

'పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలి'

ఇచ్చోడ: రానున్న పార్లమెంట్ ఎన్నికలలో ఆదిలాబాద్ ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని ఏఐసీసీ ఆదివాసీ కోఆర్డినేటర్ కోట్నాక్ తిరుపతి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్లమెంట్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆదిలాబాద్ మరింత అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్‌కు ఓటు వేయాలన్నారు. కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా పనిచేసి పార్లమెంట్ అభ్యర్థిని గెలిపించుకునే బాధ్యత తీసుకోవాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలోనే ఎన్నికల ప్రచారం ప్రారంభించారని గుర్తు చేశారు. ఇక్కడి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో నాయకులు జాంటి (ఖాలీద్), కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బుర్గుల మల్లేశ్, భరత్ వాగ్మరే, ఎక్బాల్ పటేల్, కలీం పాల్గొన్నారు.